



www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

గురువారం | 30 | జూలై | 2026 | పేజీలు: 08


# పక్కాగా రెవిన్యూ రికార్డులు

### క్షేత్రస్థాయిలో రీ సర్వే :కలెక్టర్ చంద్ర శేఖర్



**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** రెవెన్యూ రికార్డులను పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం అయన నల్గొండ జిల్లా, దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చందంపేట తహసిల్దార్ కార్యాలయాన్ని దేవరకొండ ఆర్డిఓ బి. పద్మ ప్రియతో కలిసి సందర్శించి తహసిల్దార్ సత్యనారాయణ, సిబ్బందితో రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఇటీవల చేపట్టిన భూముల రీ సర్వే, అటవీ భూములు, రెవెన్యూ భూములు, సాధారణ సర్వేలో సమస్యలు, తదితర అంశాలపై గ్రామాల వారిగా ఆర్డిఓ, తహసిల్దారుతో సమీక్షించారు. ప్రభుత్వ భూముల ..మిగతా 2లో



# సమన్వయంతోనే సత్ఫలితాలు

### ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి :** జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయాన్ని సందర్శించారు.కార్యాలయాన్ని అనువైన వేరే భవనంలోకి షిఫ్టింగ్ పై కలెక్టర్ చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల ననుసరించి సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. డాకర్ల, విద్యార్థుల, రోగుల పార్కింగ్ కు, పక్కన గార్డెనింగ్, మెయిన్ రోడ్డు నుండి అప్రోచ్ రోడ్డు తదితర పెండింగ్ పనులు పూర్తి చేసి రెండు నెలల్లో ఆసుపత్రి ప్రారంభంకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ డా.రంగా అజ్మీరా, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థ డిఈఈ వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.






# భారీ వర్షాలు అప్రమత్తత అవసరం

### అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

### కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో :** వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో రాబోయే 3 రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని సూచించారు. కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా సగటున 4 సెంటీమీటర్ల ..మిగతా 2లో

# సర్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి

### కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల, అక్షిత న్యూస్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని, జిల్లాలో ఇప్పటికే దాదాపు 89 శాతం పూర్తయిందని, మిగిలిన 11 శాతాన్ని కూడా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని ..మిగతా 2లో

# భీమా స్టేజి-2 నుంచి సాగు నీటి విడుదల

### 92 వేల ఎకరాలకు సాగు నీరు

### రైతులకు నిజమైన భరోసా

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వమే రైతులకు నిజమైన భరోసా అని ..మిగతా 2లో

## సర్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి



**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, ఇంకా మిగిలిన 11 శాతం ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉందని, తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనే సందిగ్ధంలో వారు ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.

**ఒక ఓటరుకు ఒకే చోట మాత్రమే ఓటు**

హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటరు పేర్లు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లు తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, మరో ప్రాంతంలోని ఓటును రద్దు చేయించుకునేందుకు సంబంధిత బీఎల్వోకు సమాచారం అందించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదు కావని, వారు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని నిర్ణీత సమయంలో బిఎల్ఓ లకు సమర్పించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు తమ పరిధిలో ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, వారు త్వరితగతిన పత్రాలు పూర్తి చేసి అందజేసేలా చర్యలు తీసుకోని అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

## పక్కాగా రెవిన్యూ రికార్డులు



**మొదటి పేజీ తరువాయి...**

సర్వే సమయంలో పరిశీలన పక్కగా జరగాలని, ముఖ్యంగా అటవీభవములు, రెవిన్యూ భూములు ,ప్రభుత్వ భూముల సర్వే సమయంలో క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలోని బొల్లారం పట్టి, అచ్చంపేట పట్టీలకు ప్రాధాన్యత ఇచ్చి ఆ రెండు గ్రామాలకు సంబంధించిన భూ రికార్డులను స్పష్టత వచ్చే విధంగా రూపొందించాలని చెప్పారు. వారం, పది రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాలలో భూ రికార్డుల లో స్పష్టత తీసుకురావాలని తహసిల్దారును ఆదేశించారు. ఇందుకు గాను ప్రతిరోజు కనీసం 3 నుండి 4 గంటలు ఈ అంశంపై పనిచేయాలని ఆదేశించారు. భూముల రీ-సర్వే సందర్భంగా తలెత్తుతున్న సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండలంలో భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, రీ-సర్వే అంశాలను ఆర్డిఓ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పొగిళ్ళకు సంబంధించి రికార్డులను ఇదివరకే పరిశీలించినందున వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పొగిళ్ల రికార్డులను కూడా సిద్ధం చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# భీమా స్టేజి-2 నుంచి సాగు నీటి విడుదల

**మొదటి పేజీ తరువాయి...**

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డిలు భీమా స్టేజి--2 నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమా స్టేజి--2 ద్వారా సుమారు 92 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనున్నదని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోయినా, రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటిని విడుదల చేసిందన్నారు. రైతుల పొలాలు పచ్చగా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని, అవసరమైన మేరకు నీటి సరఫరా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.





ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తోందన్నారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి సహాయం, రుణమాఫీ, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. నేడు భీమా స్టేజి--2 ద్వారా రైతులకు అందుతున్న సాగునీరు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ఫలితమే అని గుర్తు చేశారు. దూరదృష్టితో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేటికీ లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతోందని, రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త సాగునీటి ప్రాజెక్టును కూడా నిర్మించని నాయకులు నేడు సాగునీటి గురించి మాట్లాడడం విడ్డూరంగా, హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే నీళ్లు విడుదలవుతుంటే, వాటి ఘనతను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేయడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. రైతుల కోసం శాశ్వత ఆలోచన, అభివృద్ధి దృష్టి, కార్యాచరణ కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని, బీఆర్ఎస్ పాలనలో ప్రచారం ఎక్కువ -- పని తక్కువగా సాగిందని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మాటలు కాదు, చేతల్లో చూపిస్తూ రైతుల కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, సాగునీటి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వబోమని, ప్రతి ఎకరాకు నీరు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీ వర్షాలు అప్రమత్తత అవసరం

**మొదటి పేజీ తరువాయి...**

వర్షపాతం నమోదయిందని, తిర్యాణి మండలంలో అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, లింగాపూర్, కెరమెరి మండలాలలో భారీ వర్షాలు కురిసాయని తెలిపారు. మహారాష్ట్రలోని వార్ధా, వైన్ గంగా పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ప్రశాంతంగా ప్రవహించే ప్రాణహిత నదిలోకి చెలిమల వాగు, ఉల్లిపిట్ట వాగుల ద్వారా భారీగా వరద నీరు చేరుతోందని తెలిపారు. మొవాడ్ వైపు నుంచి వస్తున్న వరద నీటితో వట్టివాగు ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అవుతుందని, నీటిమట్టం నిర్దేశిత స్థాయికి చేరుకోవడంతో 2 గేట్లను ఎత్తి 2 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. పరిస్థితిని ప్రతి గంట గంటకు సమీక్షిస్తూ అవసరాన్ని బట్టి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలను నియంత్రిస్తున్నామని తెలిపారు. ఏ అత్యవసర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు మంచిర్యాల నుంచి ప్రత్యేక పోలీస్ బెటాలియన్ బృందాలు, బోట్లు, లైఫ్ జాకెట్లతో సహా కాగజ్‌నగర్‌కు చేరుకున్నాయని తెలిపారు. ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణులను ముందస్తుగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లోలెవల్ వంతెనలు, వాగులు పొంగిపొర్లుతున్న ప్రాంతాల వద్ద ట్రాక్టర్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల సిబ్బందితో నిరంతర పహారా నిర్వహిస్తున్నామని, నీటి ప్రవాహం



పూర్తిగా తగ్గే వరకు ప్రజల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు. జలపాతాల వంటి పర్యాటక ప్రాంతాలలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నీటి లోతుపై అవగాహన లేకపోవడం, సోషల్ మీడియా కోసం రీల్స్, ఫోటోలు తీసే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు .వర్షాలు తగ్గిన తర్వాత కూడా జలపాతాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పర్యాటక రుసుము వసూలు చేసే గ్రామ పంచాయతీలకు పర్యాటకుల భద్రత బాధ్యతలను అప్పగించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని చిల్లపూర్, బాబాపూర్, గొడవెల్లి, గుండి గ్రామాల ప్రజలతో పాటు జిల్లా ప్రజలందరూ వాగులు, వరద ప్రవాహాల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగం జారీ చేసే సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించి అధికారులకు సహకరించాలని తెలిపారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో జిల్లాలోని వాగులు, వంకలు, నదులలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, పశువుల కాపరులు, రైతులు పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాలు, వరదల కారణంగా అత్యవసర పరిస్థితులు ఎదురైతే ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ నం. 8500844365ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర పరిస్థితులలో ప్రజలు ఈ నంబర్‌ను సంప్రదించి సహాయం పొందాలని తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రియాజ్ అలీ, సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# గుంతకోడూరులో ఫామ్ పౌండ్ నిర్మాణ పనులను పరిశీలన

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,**

నాగర్‌కర్నూల్, అక్షిత ప్రతినిధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి,అధికారులకు కలెక్టర్ ఆదేశం,మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలు త్వరలో విడుదల చేస్తామని హామీ,నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూర్ మండలం గుంతకోడూరు గ్రామంలో వీబీ-జీ రామ్ జీ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ పథకం ద్వారా చేపడుతున్న ఫామ్ పౌండ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బుధవారం కూలీలు చేస్తున్న నిర్మాణ పనులను పరిశీలించారు. రైతులకు వ్యవసాయానికి అనుబంధంగా అదనపు ఆదాయ వనరులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.





గుంతకోడూరు గ్రామానికి చెందిన రైతు చంద్రయ్య వ్యవసాయ క్షేత్రంలో సుమారు 15x15 చదరపు పరిమాణంలో నిర్మిస్తున్న ఫామ్ పౌండ్‌ను కలెక్టర్ సందర్శించి పనుల నాణ్యత, పురోగతి, అమలు తీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయని, రోజువారీ ఎంతమంది కూలీలు పనిచేస్తున్నారని, నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

పనుల్లో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

అనంతరం రైతు చంద్రయ్యతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, ఫామ్ పౌండ్ పూర్తయిన తర్వాత అందులో చేపల పెంపకం చేపట్టే ప్రణాళిక గురించి తెలుసుకున్నారు. చేపల పెంపకానికి సంబంధించి అవసరమైన సాంకేతిక సూచనలు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, సబ్సిడీలు లేదా ఇతర సహాయంపై ఏవైనా సందేహాలు ఉంటే మత్స్యశాఖ, వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి పూర్తి స్థాయి మార్గదర్శకాలు పొందాలని సూచించారు. ఫామ్ పౌండ్ల ద్వారా సాగునీటి వినియోగం మెరుగుపడటంతో పాటు చేపల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు.

పనుల వద్ద విధులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలతో కూడా కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత మూడు నెలలుగా తమకు కూలి వేతనాలు అందడం లేదని కూలీలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+బీ=జు+రా) నుంచి వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా పథకానికి మార్పు జరిగిన నేపథ్యంలో నిధుల విడుదలలో జాప్యం ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను త్వరితగతిన విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, పనులకు సంబంధించి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన కలెక్టర్, కూలీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

**డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్...**



భద్రాచలం అక్షిత న్యూస్:- మనకు ప్రాణవాయువును అందించే మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటే మనకు ఎటువంటి రోగాలు రుగ్మతలు దరిచేరవని భద్రాచలం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ అన్నారు.మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలం నందు "ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం" పురస్కరించుకొని ఎన్ ఎస్ ఎస్ ఈసి ఓ,సి ఎల్ యూ , క్లబ్ యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చెట్టు ప్రగతికి మెట్టు అనే నినాదాన్ని దృష్టిలో పెట్టుకొని మనకు ప్రాణవాయువు అందించడమే కాకుండా చల్లటి నీడను ఇచ్చి కాసేపు సేద తీరడానికి చెట్టు ఎంతో ఉపకరిస్తాయని అందుకు ప్రతి ఒక్కరూ ముఖ్యమైన సందర్భాలలో కాకుండా మన ఇంటిలో జరిగే పుట్టినరోజు మరియు పెళ్లిరోజు వేడుకలలో తప్పనిసరిగా ప్రజలకు పనికివచ్చే మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని అన్నారు.

అనంతరం మై భారత్ పోర్టల్ జిల్లా కన్వీనర్ రాంబాబు విద్యార్థులకు పర్యావరణ 10 రక్షణ మరియు మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను అలాగే మొక్కలు నాటడం వలన పర్యావరణంలో కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హవీలా,ఎన్ఎస్ఎస్ పిఓ లు అయిన డాక్టర్ కిరణ్ కుమార్, బి .సుధాకర్ రావు, అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సర్ పై కాంగ్రెస్ నాయకుల సమీక్ష సమావేశం



చౌటుప్పల్ /అక్షిత న్యూస్ చౌటుప్పల్ మండలం, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర ఓటర్ జాబితా సవరణ జరుగుతున్న తీరు పై చౌటుప్పల్ లోని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ ఏ లు ముఖ్యనాయకులతో సమీక్ష సమావేశను నిర్వహించారు. ఈ సమావేశానికి మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సర్ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్ కుమార్ హాజరై మాట్లాడుతూ..ఇప్పటివరకు సర్ ప్రక్రియలు మునుగోడు నియోజకవర్గం ముందంజలో ఉందని మిగిలిన ఈ నాలుగు రోజులు కూడా కష్టపడి నిజమైన ఓటు ఒక్కటి కూడా మిస్ కాకుండా చూడాలన్నారు. ఇప్పటివరకు ఆయా బూత్ లలో ఎంత శాతం సర్ ప్రక్రియ పూర్తయింది ఏమైనా సమస్యలు ఉన్నాయా?ఆన్ మ్యాప్డ్, డబుల్ ఓట్లు అప్సెంట్ ఓట్లకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ నిజాయతీగా పని చేస్తున్నందునే సర్ ప్రక్రియ వేగవంతంగా అవుతుందని ఈ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు ప్రతి బి.ఎల్.ఏ కు స్థానిక కార్యకర్తలు, నాయకులు సహకరిస్తూ మునుగోడు నియోజకవర్గంను ప్రథమ స్థానంలో ఉండే విధంగా కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ సర్ కో ఆర్డినేటర్ రుద్ర సంతోష్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు బోయ దేవేందర్,స్థానిక కౌన్సిలర్ లు, బి ఎల్ ఏ లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో కురిసిన ఓ మోస్తరు వర్షం





రాజన్న సిరిసిల్ల, అక్షిత ఉదయం నుండి కురిసిన వర్షానికి జిల్లా కేంద్రంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. సిరిసిల్ల పాత బస్టాండ్ దగ్గరలోని కరీంనగర్ రోడ్డుపైకి మోకాల్లోతు వర్షం నీరు వచ్చి చేరింది. సిరిసిల్ల నుండి కరీంనగర్ వెళ్లే రోడ్డు అంతా చిన్న సైజు చెరువుని తలపిస్తుంది. దీంతో, ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సంజీవయ్య నగర్ కమాన్ వద్ద పెద్ద ఎత్తున నీరు రావడంతో బారీ కేడ్లు అడ్డం పెట్టి సంజీవయ్య నగర్ వైపు వెళ్లకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని సంజీవయ్య నగర్, అశోక్ నగర్, పాత బస్టాండ్, వెంకంపేట తదితర ప్రాంతాల్లోని పలు రోడ్లు జలమయం కావడంతో , ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

# కొల్లాపూర్ 12వ వార్డులో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం

**బిఎల్ఏ లకు దిశానిర్దేశం**





కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి: కొల్లాపూర్ మున్సిపాలిటీ 12వ వార్డులో మాజీ కౌన్సిలర్ మేకల శిరీష కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ రాచమల్ల సిద్దేశ్వర్, టిపిసిసిఅధికార ప్రతినిధి, కొల్లాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథులుగా హాజరై బిఎల్ఏ లకు పలు దిశా నిర్దేశం చేశారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పులపై బిఎల్ఏ లు అప్రమత్తంగా ఉండి, ప్రతి ఇంటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పసుపుల నరసింహ, కౌన్సిలర్లు 1వ వార్డు పసుల సుజాత, 8వ వార్డు అన్వర్ పాషా, 16వ వార్డు పెబ్బేటి శేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యండి ఇక్బాల్, యూత్ అధ్యక్షులు అజమ్, నాగరాజు, వెంకటేష్, వెంకటయ్య, ఆరిఫ్, మల్లేష్, మహిళా నాయకురాళ్లు భవాని, సుగుణ, శోభారాణి, రజిత, ఉమా, జయమ్మ తో పాటు వార్డు బిఎల్ఏ లు పాల్గొన్నారు.

## కాసం లక్ష్మారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**: మాజీ ఎంపీటీసీ జక్కన్న మహబూబ్ రెడ్డి**



తొర్రూరు, అక్షిత బ్యూరో: నెల్లికుదురు మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి అనారోగ్యంతో మృతిచెందడం తీవ్ర విషాదకరమని మాజీ ఎంపీటీసీ జక్కన్న మహబూబ్ రెడ్డి అన్నారు. మంగళవారం కాసం లక్ష్మారెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కాసం లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన అంకితభావం గల నాయకుడని కొనియాడారు. ఆయన మరణం జిల్లా కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాసం లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని జక్కన్న మహబూబ్ రెడ్డి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో గంజి విజయపాల్ రెడ్డి, గంజి దేవేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు రావుల వెంకటరెడ్డి, గడీల మాధవి సాయిలు, వెన్నం సోమిరెడ్డి, మహంకాళి సంపత్, యర్రం రాజు యాదవ్ తదితరులు పాల్గొని కాసం లక్ష్మారెడ్డికి నివాళులర్పించారు.

## పేపర్ లీకేజీ నిరోధక చట్టాన్ని వ్యతిరేకించడం కాంగ్రెస్, ఇండియా కూటమి ద్వంద్వ వైఖరికి నిదర్శనం

**-- బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి**



రామన్నపేట,అక్షిత ప్రతినిధి :పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పేపర్ లీకేజీ నిరోధక చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు వ్యతిరేకించడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి విమర్శించారు.నీట్ (నీజుజు) పేపర్ లీకేజీ అంశంపై దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులు ఇప్పుడు పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కఠిన చట్టాన్ని వ్యతిరేకించడం వారి ద్వంద్వ వైఖరిని బయటపెడుతోందని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ చట్టం ద్వారా పేపర్ లీక్‌లకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు, భారీ జరిమానాలు, వ్యవస్థీకృత ముఠాలపై కఠిన చర్యలు, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా వేగవంతమైన విచారణ వంటి నిబంధనలు అమలులోకి వస్తాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే పేపర్ లీక్‌లను కఠినంగా అరికట్టడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

దేశంలోని ప్రతి విద్యార్థి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ చట్టాన్ని ప్రతి భారతీయుడు స్వాగతించాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో పేపర్ లీకేజీలకు పాల్పడే వారిలో భయం కలిగించేలా ఇలాంటి కఠిన చట్టాలు అవసరమని పేర్కొన్నారు.పేపర్ లీకేజీలను రాజకీయాల కోసం ఉపయోగించుకోవడం మానుకుని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతిపక్ష పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ బిల్లును వ్యతిరేకించిన పార్టీల వైఖరిని దేశ ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలే తగిన సమయంలో సరైన తీర్పు ఇస్తారని బండ మధుకర్ రెడ్డి అన్నారు.చివరిగా, దేశ ప్రయోజనాలు మరియు విద్యార్థుల భవిష్యత్తుకు విరుద్ధంగా వ్యవహరించే చర్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# వర్షపాతం వివరాలు ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**





నిర్మల్, అక్షిత ప్రతినిధి :నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశంజిల్లా వ్యాప్తంగా నమోదయ్యే వర్షపాతం వివరాలను ఖచ్చితత్వంతో ఎప్పటికప్పుడు నమోదు చేసి సంబంధిత శాఖలకు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూగర్భ జలాల కొలతల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షపాతం, భూగర్భ జలాల వివరాల నమోదు విధానాన్ని పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా వివరాలను నమోదు చేయాలని సూచించారు.

అనంతరం నిర్మల్ గ్రామీణ మండలం అక్కాపూర్ గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం ప్రాంగణంలో ఉన్న వర్షపాత మాపక కేంద్రాన్ని తనిఖీ చేశారు. వర్షపాతం కొలత, నమోదుకు అనుసరిస్తున్న విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షపాతం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు సంబంధిత శాఖలకు వేగంగా చేరవేయాలని ఆదేశించారు. ప్రతి నమోదు శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం ఎల్లపల్లి సమీపంలోని నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన పనుల వివరాలను తెలుసుకుని, మిగిలిన పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ తనిఖీలలో సీపీవో గంగారెడ్డి, తహసిల్దార్ ప్రభాకర్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, హైడ్రో జియాలజిస్ట్ వంశీకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో ఆపద్బాంధవుడు

**108 అంబులెన్స్ లోనే సురక్షిత ప్రసవం.**

**తల్లి బిడ్డ క్షేమం**



అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:ప్రసవ వేదనలతో బాధపడుతున్న ఓ గర్భిణికి ఆసుపత్రికి చేరుకునేలోపే పురిటి నొప్పులు ఎక్కువవ్వడంతో..దీంతో 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఈఎంటీ చంటి సమయస్ఫూర్తితో వ్యవహరించి అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు.తల్లీబిడ్డలు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకోగా,108 సిబ్బందిపై ప్రశంసల వర్షం కురిసింది.వివరాల్లోకి వెళ్తే జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన జెల్ల అంజలి (20)కి మంగళవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. కొద్ది నిమిషాల్లోనే అంబులెన్స్ గ్రామానికి చేరుకుని అంజలిని భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం ప్రారంభించింది.మార్గమధ్యలోనే ప్రసవ వేదనలు తీవ్రం కావడంతో పరిస్థితిని వెంటనే గుర్తించిన ఈఎంటీ చంటి ఎలాంటి ఆందోళనకు గురికాకుండా వైద్య నైపుణ్యంతో అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. అంజలి పండంటి మగబిడ్డకు జన్మనివ్వగా, అనంతరం తల్లీబిడ్డలను భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.అత్యవసర సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి తల్లీబిడ్డల ప్రాణాలను సురక్షితంగా కాపాడిన ఈఎంటీ చంటి, అంబులెన్స్ పైలెట్ రాజేందర్ సేవలను స్థానికులు, వైద్యులు, కుటుంబ సభ్యులు అభినందించారు...

## రైతుల శ్రేయస్సు గ్రామాభివృద్ధి కోసం బోగారంలో ప్రత్యేక పూజలు

**బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్**



రామన్నపేట అక్షిత ప్రతినిధి రామన్నపేట మండలం బోగారం గ్రామంలో రైతుల శ్రేయస్సు, సమృద్ధిగా వర్షాలు కురవాలని, గ్రామ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ బుధవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ నాభిశిల బొడ్రాయి వద్ద గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించింది. గ్రామ మహిళలు ప్రతి ఇంటి నుంచి బిందెడు నీరు, ఆవుపాలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు తీసుకువచ్చి నాభిశిల బొడ్రాయికి జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి రైతుల సంక్షేమం, గ్రామాభివృద్ధి, సకాలంలో వర్షాలు కురవాలని ప్రార్థించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, వివిధ యువజన సంఘాల నాయకులు, మహిళలు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ, "రైతే దేశానికి వెన్నెముక. రైతుల శ్రేయస్సు, గ్రామ ప్రజల సుఖశాంతి కోసం గ్రామ సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతి ఏడాది ఇలాంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నాం. సకాలంలో వర్షాలు కురిసి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాం" అని తెలిపారు.

# వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలి

**గేదెల పెంపకంతో పాటు పశుగ్రాస సాగుపై రైతులు దృష్టి సారించాలి,**

**పాల ఉత్పత్తుల ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి,**

**పాడి రైతులకు అవగాహన సదస్సులో**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,**





**నాగర్‌కర్నూల్, అక్షిత ప్రతినిధి** రైతులు కేవలం పంటల సాగుపైనే ఆధారపడకుండా వ్యవసాయానికి అనుబంధ రంగమైన పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి రైతు వేదికలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాలకు చెందిన పాడి రైతులకు సీడ్ ఫామ్ వారి సౌజన్యంతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో పాడి పశువులకు పశుగ్రాస కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, తక్కువ నీటితో పెరిగే గడ్డి రకాలను సాగు చేయడం, పశుగ్రాస నిల్వ పద్ధతులు, పాడి పరిశ్రమలో శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ ....... ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయానికి అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, పశుపోషణ, కోళ్ల పెంపకం వంటి రంగాలు రైతు కుటుంబాలకు అదనపు ఆదాయాన్ని అందించడంతో పాటు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పిస్తాయని, పంటల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు పాడి పరిశ్రమ రైతు కుటుంబాలకు నిత్య ఆదాయ వనరుగా నిలుస్తుందని, ముఖ్యంగా గేదెల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టి పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా అధిక లాభాలను ఆర్జించే అవకాశం ఉందని, పాడి పశువుల పెంపకంతో పాటు వాటికి అవసరమైన పచ్చిగడ్డి, పశుగ్రాసాన్ని రైతులు తమ సొంత వ్యవసాయ భూముల్లోనే సాగు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాడి పరిశ్రమలో విజయం సాధించాలంటే గేదెలకు నాణ్యమైన ఆహారం, సమతుల్య పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం, సకాలంలో వైద్య సేవలు ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పశుగ్రాస కొరత రాకుండా రైతులు తమ వ్యవసాయ పొలాల్లోనే నాణ్యమైన గడ్డి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా తక్కువ నీటితో పెరిగే పశుగ్రాస పంటలను ఎంచుకొని సాగు చేస్తే పశువులకు సంవత్సరం పొడవునా పచ్చిమేత అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా పశుగ్రాస నిల్వలను సిద్ధం చేసుకోవాలని, పచ్చిగడ్డిని సైలేజ్ రూపంలో భద్రపరచడం వంటి ఆధునిక పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ఇలా చేయడం ద్వారా ఎండాకాలంలో కూడా పశువులకు మేత కొరత లేకుండా చూసుకోవచ్చని అన్నారు.రైతులు అధిక పాల దిగుబడినిచ్చే గేదెలను ఎంపిక చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పెంపకం చేపట్టాలని, పశువులకు అవసరమైన టీకాలు, ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పాల ఉత్పత్తుల నాణ్యత పెరిగితే మార్కెట్‌లో మంచి ధర లభించడంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని చెప్పారు.

ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక సంక్షేమ, ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందని, పశుసంవర్ధక శాఖ ద్వారా అందించే సేవలను రైతులు పూర్తిగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అధికారులు గ్రామస్థాయిలో రైతులకు సాంకేతిక సలహాలు, శిక్షణ కార్యక్రమాలు, పశువైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి అవగాహన ఏర్పాటు చేసిన సంస్థను కలెక్టర్ అభినందించారు. అన్ని మండలాల్లోని రైతు వేదికల్లో రైతులకు అవగాహన కల్పించేలా ముందుకు రావాలని కలెక్టర్ సందర్భంగా సంస్థ ప్రతినిధులను కోరారు.సీడ్ ఫామ్‌కు చెందిన నిపుణులు రైతులకు పశుగ్రాస సాగులో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలు, అధిక దిగుబడినిచ్చే గడ్డి రకాలు, విత్తనాల ఎంపిక, సాగు నిర్వహణ, మేత నిల్వ పద్ధతులు, సైలేజ్ తయారీ, హైడ్రోపోనిక్ ఫోడర్, పాడి పశువుల సమతుల్య పోషకాహారం, పాల ఉత్పత్తి పెంపుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సవివరంగా వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ పలు సందేహాలను నివృత్తి చేశారు.కార్యక్రమానికి హాజరైన రైతులు పాడి పరిశ్రమను లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పశుగ్రాస నిర్వహణ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలను గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ లచ్చిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్, వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ ఫామ్ నిపుణులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నుంచి వచ్చిన పాడి రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

**కాజీపేట ట్రాఫిక్ ఎస్ఐ బి. మంగా**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి** :కాజీపేట చౌరస్తాలో పోగొట్టుకున్న సెల్ ఫోన్ కాజీపేట ట్రాఫిక్ పోలీసులు బాధితుడికి అప్పగించరు . పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట జంక్షన్ లో ఎస్ఐ బి.మంగ వెహికల్ చెకింగ్ చేసే క్రమంలో ఆపిల్ సెల్ ఫోన్ ఎవరో పోగొట్టుకోగా, అట్టి ఫోన్ ను అక్కడే పాయింట్ మీద ఉన్న హెడ్ కానిస్టేబుల్ సారయ్య ఎస్ ఐ మంగకి అప్పగించారు.అనంతరం అవసరమైన ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేసి, యజమానికి సెల్ ఫోన్‌ను అందజేశారు. మొబైల్ ఫోన్‌ను తిరిగి పొందిన బాధితుడు కాజీపేట ట్రాఫిక్ ఎస్ఐ బి. మంగాకి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లు లేదా విలువైన వస్తువులు పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# డెడ్ స్టోరేజికి చేరువలో నాగార్జునసాగర్



**త్రిపురారం అక్షిత న్యూస్** సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజున నాగార్జునసాగర్ డ్యాం అన్ని గేట్లు ఓపెన్ 18 ఏళ్ల తర్వాత తొలిసారి జూలై నెలలోనే ఇదే రోజున గత ఏడాది తెరుచుకున్న గేట్లు ఆసమయంలో సాగర్ కు 2,55,811 క్యూసెక్కులు. ఈ ఏడాది వెలవెలబోతోన్న సాగర్. ఎగువ ప్రాంతాల్లో వానలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రాజెక్టులోకి రాని నీరు. ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరువలో నాగార్జున సాగర్ మరో మూడు అడుగులు తగ్గితే డెడ్ స్టోరేజ్.సాగర్ ఆయకట్టు కింద ప్రతి సంవత్సరం ఇంచు మించు లక్ష ఎకరాలు సాగు చేస్తున్నారు రైతులు.ఈసారి కాలం రైతుల మీద శాపంగా మారింది.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-నారాయణపూర్ ఎస్సై సీతా పాండు**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్** మండల వ్యాప్తంగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నారాయణపూర్ ఎస్సై సీతా పాండు సూచించారు. గ్రామాల పరిధిలోని నది నీటి ప్రవాహంలోకి ప్రజలు వెళ్లవద్దన్నారు. పాతబడిన ఇళ్లలో ఎవరైనా ఉన్నట్లయితే వేరొక చోట వర్షాలు తగ్గేంతవరకు నివాసం ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులు మినహా అవసరం లేకుండా బయటకు వెళ్ళవద్దని సూచించారు. రైతులు వ్యవసాయ పొలాల వద్ద వర్షానికి తడిసిన విద్యుత్ మోటార్లను తాకవద్దని కోరారు. మెరుపులు సంభవిస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద లేదా తెగిపోయిన విద్యుత్ తీగల సమీపంలో నిలబడవద్దని ఎస్సై సూచించారు. వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లోకి వెళ్లేందుకు లేదా రోడ్లపై ప్రవహిస్తున్న వాగులను దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. నీరు నిలిచిన రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు వాహన వేగాన్ని తగ్గించి అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. యువత తమ వాహనాలతో రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కాలువలు, చెరువులు,వాగులు, వరద నీటి ప్రాంతాల వద్దకు వెళ్ళనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వాతావరణ శాఖ,జిల్లా యంత్రాంగం,పోలి శాఖ జారీ చేసే సూచనలు,హెచ్చరికలను తప్పనిసరి పాటించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితి లేదా సహాయం అవసరమైన సందర్భంలో వెంటనే పోలీస్ స్టేషన్ కు, అత్యవసర సేవా విభాగానికి,గ్రామస్థాయి అధికారుల దృష్టికి తీసుకువస్తే తమ వంతుగా సహకరిస్తామన్నారు.

# 9 వార్డులో మన ఓటు మన హక్కు

**ఎమ్మెల్యే,డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



**నాగర్‌కర్నూల్, అక్షిత ప్రతినిధి** అచ్చంపేట ఎమ్మెల్యే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఎస్ ఐ ఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఇన్చార్జి రాములు గారి నాయకత్వంలోప్రతి ఒక్కరు ఓటరు గడపగడప తిరిగి వారికి తెలియపరచి మీకు ఇచ్చినటువంటి ఓటర్ పేపర్ను త్వరగా మీరు ఓటునమోదు చేసుకోవాలి అని తెలియపరచి మన ఓటు మన బాధ్యత అని చెప్పి ప్రతి ఒక్క ఓటర్ ను కలిసి ఓటును నమోదు చేసే విధంగా చర్యలు చేపడుతున్నాము డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచన కాబట్టి 9వ వార్డు ఇంచార్జ్ రాములు కొండూరు శేఖర్ భరత్ కుమార్ మహబూబ్ అలీ రాజగోపాల్ నయుశీ. బి ఎల్ ఓ పాల్గొనడం జరిగిన

# మిడ్ మానేరు జలాశయంలో స్వల్పంగా పెరిగిన నీటి నిల్వ

**రాజన్న సిరిసిల్ల, అక్షిత** మిడ్ మానేరు జలాశయంలో స్వల్పంగా పెరిగిన నీటి నిల్వరాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు జలాశయంలో నీటి నిల్వ స్వల్పంగా పెరిగింది. బుధవారం జూలై 29 ఉదయం 6 గంటల నాటికి జలాశయం నీటిమట్టం 307.09 మీటర్లకు చేరుకోగా, 7.479 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.55 టీఎంసీలు.గత ఏడాది ఇదే రోజున నీటి మట్టం 306.93 మీటర్లు, నిల్వ 7.293 టీఎంసీలుగా నమోదైంది.గత 24 గంటల్లో 390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా, 112 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం జలాశయం నుంచి సాగునీరు విడుదల చేయడం లేదు. ఆవిరైపోవడం మరియు నిర్వహణ అవసరాలకే నీటి వినియోగం జరుగుతోంది.జలాశయంలోని స్పిల్‌వే గేట్లు, రివర్ స్లూయిస్ గేట్లు అన్నీ మూసివేసి ఉన్నాయి.జూన్ 1 నుంచి ఇప్పటి వరకు జలాశయానికి 0.238 టీఎంసీల ఇన్‌ఫ్లో, 0.474 టీఎంసీల అవుట్‌ఫ్లో నమోదైంది.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-చౌటుప్పల్ సీఐ జీ. మన్మథ కుమార్**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్** మండల వ్యాప్తంగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ సీఐ జి. మన్మధకుమార్ సూచించారు. గ్రామాల పరిధిలోని నది నీటి ప్రవాహంలోకి ప్రజలు వెళ్లవద్దన్నారు. పాతబడిన ఇళ్లలో ఎవరైనా ఉన్నట్లయితే వేరొక చోట వర్షాలు తగ్గేంతవరకు నివాసం ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులు మినహా అవసరం లేకుండా బయటకు వెళ్ళవద్దని సూచించారు. రైతులు వ్యవసాయ పొలాల వద్ద వర్షానికి తడిసిన విద్యుత్ మోటర్లను తాకవద్దని కోరారు. మెరుపులు సంభవిస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద లేదా తెగిపోయిన విద్యుత్ తీగల సమీపంలో నిలబడవద్దని సీఐ సూచించారు. వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లోకి వెళ్లేందుకు లేదా రోడ్లపై ప్రవహిస్తున్న వాగులను దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. నీరు నిలిచిన రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు వాహన వేగాన్ని తగ్గించి అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. యువత తమ వాహనాలతో రోడ్లపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కాలువలు, చెరువులు,వాగులు, వరద నీటి ప్రాంతాల వద్దకు వెళ్ళనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వాతావరణ శాఖ,జిల్లా యంత్రాంగం,పోలీ శాఖ జారీ చేసే సూచనలు,హెచ్చరికలను తప్పనిసరి పాటించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితి లేదా సహాయం అవసరమైన సందర్భంలో వెంటనే పోలీస్ స్టేషన్ కు, అత్యవసర సేవా విభాగానికి,గ్రామస్థాయి అధికారుల దృష్టికి తీసుకువస్తే తమ వంతుగా సహకరిస్తామన్నారు.

## ప్రజాపాలనలోనే నిరుపేదలకు

# నిజమైన ఇందిరమ్మ ఇండ్లు..

**ఎమ్మెల్యే మందుల సామేలు**

**గత పాలకుల డబుల్ బెడ్‌రూమ్ పథకం కేవలం కాంట్రాక్టర్లకే పరిమితం**

**అసంపూర్తి ఇండ్లు కంపచెట్లతో నిండి దయ్యాల కొంపల్లా మారాయి**

**ఎన్నికల ముందు తెల్లకాగితాలు ఇచ్చి ప్రజలను వంచించారు**

**నాగారం బంగ్లాలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన తుంగతుర్తి ఎమ్మెల్యే**



**నాగారం, అక్షిత ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత ప్రజాపాలనలోనే అర్హులైన నిరుపేద కుటుంబాలన్నింటికీ నిజమైన సంక్షేమ ఫలాలు అందుతాయని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కల నిజమవుతుందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం నాగారం బంగ్లా గ్రామంలో గుంతకండ్ల ధనలక్ష్మి – వేణుగోపాల్ రెడ్డి వారి నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు నూతన పట్టు వస్త్రాలను అందజేసి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. గత పాలకులు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకాన్ని కేవలం



కాంట్రాక్టర్ల స్వలాభానికి, కమిషన్లకే పరిమితం చేశారని మండిపడ్డారు. వారు అసంపూర్తిగా వదిలేసిన ఇండ్లు నేడు కంపచెట్లతో నిండి దయ్యాల కొంపల్లా తయారయ్యాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో ఏ ఒక్క నిరుపేదకూ ఇల్లు ఇవ్వకుండా, కేవలం కమిషన్ల కోసమే ఆశపడి వైకుంఠధామాలను నిర్మించారని విమర్శించారు. అంతేకాకుండా, గత ఎన్నికల ముందు చివరి దశలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరయ్యాయంటూ ప్రజలకు తెల్లకాగితాలు (టోకెన్లు) ఇచ్చి తీవ్రంగా ఆశపెట్టి వంచించారని గుర్తుచేశారు.గత పాలకుల

మోసాలను పారద్రోలి, మన తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అగ్రగామిగా అభివృద్ధి చేసే పూర్తి బాధ్యత తనదేనని ఆయన ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన వెంకట బిక్షం , స్థానిక గ్రామ సర్పంచ్ భయ్యం వెంకన్న , స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమామాభివృద్ధియే సహకార సంఘాల ప్రధాన లక్ష్యం

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**పి ఏ సి ఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం**



**భువనగిరి అక్షిత న్యూస్** రైతుల సంక్షేమ అభివృద్ధి ప్రధాన లక్ష్యం అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పి ఏ సి ఎస్ నూతన పాలకవర్గ సమావేశంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గ సభ్యులకు శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పీఏసీఎస్ చైర్మన్‌గా గరిసె రవి కి మండల ప్రజలు గొప్ప బాధ్యతను అప్పగించారని తెలిపారు. ప్రజలు, రైతులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పదవికి గౌరవం తీసుకొచ్చేలా నూతన పాలకవర్గం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పారదర్శకతతో, జవాబుదారీతనంతో సేవలందించాలని కోరారు.

వలిగొండ మండల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి పనులను ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో చేపడుతూ, భువనగిరి నియోజకవర్గ సమగ్ర



అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ గరిసె రవి మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. రైతులకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందిస్తూ సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమానాయక్, వలిగొండ గ్రామ సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, ఉపసర్పంచ్ మల్ల మాధవి , మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని సహదేవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వాకిటి పద్మ అనంతరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సహకార సంఘ సభ్యులు, అధికారులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కొండగట్టు ఆంజనేయ స్వామి గిరిప్రదక్షిణ

### పాల్గొన్న మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ

### రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించిన ప్రజాప్రతినిధులు



**జగిత్యాల అక్షితబ్యూరో:** గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లికొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలోలి నిర్వహించిన గిరిప్రదక్షిణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు.బుధవారం తెల్లవారు జాము నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులతో కలిసి ప్రజాప్రతినిధులు గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి, సుభిక్షం కోసం ప్రార్థించారు.

**ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ**

కొండగట్టు ఆంజనేయ స్వామి మహిమ అపారమని, ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణలో పాల్గొంటారని అన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

**ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ**

గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా కొండగట్టు గిరిప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు కల్పించిందన్నారు.

**ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ**

తెలంగాణలోని అత్యంత పవిత్రమైన ఆంజనేయ క్షేత్రాల్లో కొండగట్టు ఒకటని అన్నారు. భక్తుల విశ్వాసానికి నిలయమైన ఈ క్షేత్రానికి ప్రభుత్వం అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

**ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ**

ప్రకృతి అనుకూలించి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిగా భక్తులు పాల్గొనడం వారి అపారమైన భక్తికి నిదర్శనమన్నారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ**

గురు వ్యాస పౌర్ణమి గిరిప్రదక్షిణకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. వర్ష పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు నిరంతరం అప్రమత్తంగా పని చేశారని, భక్తులు సురక్షితంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు కల్పించినట్లు వెల్లడించారు. భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని తెలిపారు. ఈ ప్రదక్షిణలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పూజారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# చౌటుప్పల్ పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలి

### బీసీవై పార్టీ తెలంగాణ పిఎసి సభ్యులు చిలకల శ్రీనివాస్ యాదవ్




**చౌటుప్పల్/ అక్షిత న్యూస్** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండల పరిధిలో ఏర్పాటు చేయబడిన పరిశ్రమలు స్థానిక ప్రజల భూములు, వనరులు, రహదారులు, విద్యుత్, నీటి వంటి మౌలిక సదుపాయాలను వినియోగించుకుంటూ కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నప్పటికీ, అదే ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని బీసీవై పార్టీ తెలంగాణ పిఎసి సభ్యులు డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ...పరిశ్రమలు స్థాపన సమయంలో స్థానికులకు ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని ఆయన తెలిపారు. దీని వల్ల చౌటుప్పల్ పరిసర ప్రాంతాలకు చెందిన చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.చౌటుప్పల్ పారిశ్రామిక అభివృద్ధి స్థానిక ప్రజల అభివృద్ధికి దోహదపడాలి గానీ, స్థానికులను పక్కనపెట్టి కేవలం లాభాలకే పరిమితం కావడం సమంజసం కాదని అన్నారు. పరిశ్రమలు సామాజిక బాధ్యతతో వ్యవహరించి స్థానికులకు కనీసం 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను స్థానిక గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, యువత నైపుణ్యాభివృద్ధి, తాగునీటి సదుపాయాలు మరియు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.స్థానికుల న్యాయమైన డిమాండ్లను స్థానిక పరిశ్రమలు విస్మరించే పరిస్థితి కొనసాగితే ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నాలు, నిరసనలు, చట్టబ ద్ధమైన ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎండీ జావెద్,మండల కార్యదర్శి పి శ్రీనివాస్, కార్యదర్శి ఆడెపు బిక్షపతి పాల్గొన్నారు.

# గ్రీన్ గ్రోవ్‌లో ఘనంగా గురు పూజోత్సవం



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గురు పూజోత్సవాన్ని గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ గురువులకు పుష్పగుచ్ఛాలు అందించి, పాదాభివందనం చేసి, వారి ఆశీస్సులు పొందారు. పాఠశాల విద్యార్థులు గురువుల గొప్పతనం, గురు–శిష్య సంబంధం, భారతీయ సంస్కృతిలో గురువు స్థానం గురించి ప్రసంగాలు, పాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బండి వీణ అనిల్ రెడ్డి మాట్లాడుతూ, "తల్లిదండ్రుల తరువాత జీవితానికి సరైన దిశను చూపించే వారు గురువులు. గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత. విద్యతో పాటు మంచి విలువలను నేర్పించే గురువుల సేవలు అమూల్యమైనవి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాదుపల్లి లక్ష్మి , ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూరాపూర్ శివారులో సాగు చేసిన పత్తి పంట

### మండల వ్యవసాయ అధికారి అనిల్



**నాగర్‌కర్నూల్, అక్షిత ప్రతినిధి** అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండల పరిధిలో సూరాపూర్ శివారు లో సాగు చేసిన పత్తి పంట ను మరియు వరి నారు మడి నీ మండల వ్యవసాయ అధికారి అనిల్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు భరత్ కుమార్ సందర్శించి తగు సూచనలు ఇవ్వటం జరిగింది . ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువ ఉన్నందున ఎకరాకు 6 -8 పసుపు జిగురు అట్టలు పెట్టుకోవాలని పెట్టుకోవాలని అలానే గులాబీ రంగు పురుగు నివారణకై ఫిరామోన్ ట్రాప్స్ అమర్చు కోవాలని సూచించడం జరిగింది . రసం పీల్చే పురుగుల నివారణకై ఫిప్రోనిల్ -400 మిల్లీ లీటర్లు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. వరి నారు పీకే వారం రోజుల ముందు 800 గ్రాములు కార్బోఫ్యురాన్ గుళికలు ఇసుకలో కలిపి చల్లుకోవాలని ఇలా చెయ్యటం వలన ప్రధాన పొలం లో వచ్చే మొవ్వ పురుగు ఉధృతి నీ తగ్గించు కోవొచ్చని సూచించడం జరిగింది. ఆరు తడి పంటలు సాగు చేసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిల్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు భరత్ కుమార్, రవి, రైతు మాధగోని సునీత, ప్రవీణ్ పాల్గొన్నారు..

# ముస్కు నరేందర్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్** చౌటుప్పల్ పట్టణ పరిధి తంగడపల్లి గ్రామంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మామ ముస్కు నరేందర్ రెడ్డి మృతి చెందగా బుధవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తంగడపల్లి లోని వారి నివాసానికి వెళ్లి నరేందర్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. మృతుని అంత్యక్రియ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి

## మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి



**వలిగొండ/ అక్షిత న్యూస్:** వలిగొండ మండలంలోని రెడ్ల రేపాక రైతు వేదిక లో ప్రస్తుత ఎలినినో వాతావరణ ప్రభావంతో జూలై నెలకు గాను పడాల్సిన వర్షం కంటే 55శాతం లోటు నమోదు అయ్యిందని , నేటికి లోటు ఉన్నందున వరి కి బదులు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఎలినినో ప్రభావం ఆగస్టు, సెప్టెంబర్ మాసంలో తీవ్రగా ఉంటాయని,అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉన్నందున వర్షాలు కూడా పడే అవకాశం లేనందున భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉన్నందున వరి వేసే రైతులు ఇతర ఆరు తడి పంటలు వేసుకోవాలని సూచించడం జరిగింది . ఒక ఎకరా వరి పండించే నీటితో ఇతర పంటలు 5- 6 ఎకరాలు పండించవచ్చని రైతులకు చెప్పారు . కావున రైతులు వరి వేసి నష్టపోవద్దని చెప్పారు, రైతులు కందులు , పేసర్లు , కూరగాయలు, ఆయిల్ పామ్ సాగుకు మొగ్గు చూపాలని చెప్పడం జరిగింది .ఈ కార్యక్రమంలో రెడ్ల రేపాక సర్పంచ్ దేశబోయిన బాలస్వామి, దాసిరెడ్డిగూడెం సర్పంచ్ రాపోలు గోపి , ఉద్యాన శాఖ అధికారి కవిత మరియు వ్యవసాయ విస్తరణ అధికారి స్వప్న , రైతులు పాల్గొన్నారు.

# పంతంగిలో ఇంకుడు గుంతకు శంకుస్థాపన...



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా పంతంగి గ్రామంలో ఇంకుడు గుంతకు ఎంపీడీవో శ్రీలత, సర్పంచ్ బోయకాకి శ్రీలత సుందర్ తో కలిసి వారి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి నిలువ, నీటి మట్టాల పెంపుదలకు ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామంలో సాధ్యమైనంత వరకు ఇంకుడు గుంతలు నిర్మించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్,టెక్నికల్ అసిస్టెంట్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్** చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షులు కాడారి కల్పన ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ చౌటుప్పల్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ గా 18 వ వార్డ్ కౌన్సిలర్ బుడ్డ సురేష్ ని ధ్రువీకరించాల్సిందిగా కోరుతూ చౌటుప్పల్ మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర నాయక్ ని కలిసి బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాల భూపాల్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి , అలె చిరంజీవి, పోలేపల్లి ముత్యాలు, గుజ్జుల సురేందర్ రెడ్డి, కాసుల వేంకటేశం, కంచర్ల వెంకట్ రెడ్డి,కాడారి అయిలయ్య యాదవ్, తెలుకుంట్ల శ్రీధర్, సర్వేల్ గ్రామం ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్, మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు వంగాల రమాకాంత్ గౌడ్ , బూత్ అధ్యక్షులు కాసోజు కనకా చారి, గోపి, కుంభ శ్రీరాములు పాల్గొన్నారు.

# వన మహోత్సవం లక్ష్యాలను చేరుకోవాలి




## జలసిరి ఫామ్ పాండ్ ల నిర్మాణంలో వేగం పెంచాలి

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వన మహోత్సవం, జలసిరి ఫామ్ పాండ్ ల నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారిగా నిర్దేశించిన లక్ష్యాలు, శాఖల వారిగా నాటే మొక్కలు, ఇతర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలసిరి ఫామ్ పాండ్ ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల వారిగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఫామ్ పాండ్ ల నిర్మాణ వివరాలు సమీక్షించారు. మొత్తం బోర్వేల్ రీచార్జ్ నిర్మాణాల ప్రగతి తెలుసుకున్నారు. గడువులోగా ఈ నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్ లు దోహదం చేస్తాయని వివరించారు.

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. నిజమైన అర్హుల పేర్లు ఎల్3 జాబితాలో ఉన్నట్లయితే అధికారులు ధృవీకరించి, వారికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు చేపట్టాలని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల అనుమతులకు సంబంధించి క్షేత్ర స్థాయి ధృవీకరణ, గెజిటెడ్ ఆఫీసర్ ధృవీకరణ, డెస్క్ ధ్రువీకరణ ప్రక్రియలు పారదర్శకంగా చేపట్టి అర్హులకు ఇండ్లు అందేలా చూడాలన్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వాగుల సమీపంలోకి పశు కాపరులు, మత్స్యకారులు, ఇతరులెవరూ వెళ్లకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 7న హైదరాబాద్‌లో పెన్షనర్ల మహాధర్నా

## ఎస్జీపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య

## డిఎస్ నకారా కు ఘన నివాళులు

## రెండు వేల కోట్లు ఎక్కడ?




**ఖమ్మం/అక్షిత బ్యూరో :**సమస్యల సుడిగుండంలో విలవిల లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ హైదరాబాద్ లో పెన్షనర్ల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య తెలిపారు.బుధవారం పెన్షనర్ల పితామహుడు డి. ఎస్ నకారా వర్ధంతి సభకు అధ్యక్షత వహించిన పరిశపుల్లయ్య మాట్లాడుతూ మూడేళ్లు గడిచినా పిఆర్సి జాడ తెలవటంలేదని ఆరువిడతల డిఏ బకాయిలు పెట్టారని హెల్త్ కార్డులు స్కీమ్ గురించి పెద్ద పెద్ద ప్రకటనలు వచ్చాయని కాని ఆచరణలో ఏమీ లేదని, పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు ప్రత్యేకోపాధ్యాయుల సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు, 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిల చెల్లింపు తదితర సమస్యలతో పెన్షనర్లు మానసిక వేదనకు గురి అవుతున్నారని చెప్పారు.డిఎస్ నకారా వర్ధంతి సందర్భముగా ఖమ్మం జిల్లా నుండి పెన్షనర్లు ఉద్యమ సమరశంఖం పూరిస్తున్నామని పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య డిమాండ్ చేసారు.మే నెల పెన్షన్లు / వేతనాల నుండి హెల్త్ స్కీమ్ ప్రీమియం మినహాయిస్తున్న ప్రభుత్వం రెండునెలలు గడిచినా కార్డులు ఇవ్వక, వైద్యం అందక స్కీమ్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉండి పెన్షనర్లు తల్లడిల్లుతున్నారని పరిశపుల్లయ్య తెలిపారు.ముందుగా పెన్షనర్ల పితామహుడు డి ఎస్ నకారా వర్ధంతి సందర్భముగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భముగా పెన్షనర్ల డిమాండ్ పోస్టర్లను రాష్ట్ర కార్యదర్శి వి మేరిఏసుపాదం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య జిల్లా ప్రధానకార్యదర్శి రాయలరవికుమార్ ఆవిష్కరించారు.ఈ

కార్యక్రమంలో జిల్లా శాఖ సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ కొలికొండ శరత్ బాబు ఊడుగు వెంకటేశ్వర్లు జల్లా వెంకటేశ్వర్లు మహిళా కార్యదర్శులు బోజెడ్ల కృష్ణకుమారి తాడి అంజలి సీనియర్ పెన్షనర్లు చీదిరాల వెంకటేశ్వర్లు రాయల వెంకటేశ్వర్లు ఎస్కే అబ్దుల్ షరీఫ్ కార్యదర్శులు బెల్లం రాధాకృష్ణ మూర్తి గండ్లూరి కృష్ణారావు పివిఆర్కేవి ప్రసాదరావు కంచుమర్తి పుల్లయ్య యండిహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి పనులు చేసేందుకు గ్రామస్తుల విముకత...

## బయట కూలి పనులకు వెళితే ఎక్కువ ఆదాయం

## నందిగామ, క్యాసారం గ్రామసభలలో కూలీల విన్నపం





**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి.**కేంద్ర ప్రభుత్వ పథకం బిబి జి రామ్ జి ద్వారా జలసిరి కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు మండలం నందిగామ, క్యాసరం గ్రామాలలో స్థానిక సర్పంచులు ఎల్లగొని విక్రంగౌడ్, సంగీత గోవర్ధన్ రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభ కార్యక్రమానికి పటాన్‌చెరు మండల స్పెషల్ ఆఫీసర్ ఐనీష్, ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ హరిశంకర్ గౌడ్ లు హాజరయ్యారు. బిబి జి రంజీ పథకం ద్వారా జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంటికి ఒక ఇంకుడు గుంత, పంటకు ఒక పంట కుంట, ఊరికి ఒక ఊరకుంట ద్వారా పనులు చేయుటకు రెండు గ్రామాలకు సంబంధించి రెండు ఎస్ హెచ్ జీ గ్రూపులకు వివో గ్రేడ్ ద్వారా పంట కుంట చేయుటకు గ్రామసభ ఏర్పాటు చేశారు.గ్రామసభలు గ్రామస్తులందరూ ఉపాధి హామీ ద్వారా వచ్చే మట్టి పనులకు గాను రోజువారి కూలీ 308 రూపాయలు మాకు సరిపోవని చెప్పారు.గ్రామంలో ఉన్న కూలీలు చుట్టుపక్కల పరిశ్రమలలో, ఇతర పనులకు వెళు న్నారు అని తెలిపారు. రోజువారి కూలీ సుమారు రూ. 700 నుంచి 1000 ఆదాయం వస్తుందని గ్రామస్తులు తెలిపారు.దీనితో ఉపాధి హామీకి సంబంధించిన మట్టి పనులను చేసేందుకు గ్రామంలోని కూలీలు ఆసక్తి చూపలేదు. రెండు గ్రామాలకు సంబంధించి గ్రామసభలో తెలిపిన వివరాలను తీర్మానం చేసి పై అధికారులకు సమాచారం తెలుపుతానమని అధికారులు పేర్కొన్నారు.అదేవిధంగా వన మహోత్సవంలో భాగంగా నందిగామ, క్యాసారం గ్రామాలలో గ్రామస్తులకు వారు మొక్కలను అందజేశారు. ఈ సమావేశంలో నందిగామ ఉపసర్పంచ్ గోరేమియా, క్యాసారం ఉపసర్పంచ్ వెంకటేష్, నందిగామ పంచాయతీ కార్యదర్శి రాజేందర్ పాటిల్, క్యాసారం పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, ఏపిఎం మాధవిలత, టిఏ శ్రీనివాస్, వార్డు సభ్యులు, ఎస్ హెచ్ జి మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.